వార్త నిర్భయం లో రిపోర్టర్లు
కావలెను
సమాజం పట్ల అవగాహన, ప్రజా సమస్యలను
ఎత్తిచూపగలిగే చైతన్యం ఉన్నవారికి ఇదే ఆహ్వానం..
తెలంగాణ& ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా
పనిచేసేందుకు విలేకరులు కావలెను
సంపాదించవల్సిన పోన్ నెం:
9949490828

తెలుగు దినపత్రిక
# వార్త నిర్భయం
సామాన్యుని చేతిలో సామాజిక అస్త్రం!
www.vaarhtanirbhayam.com
ఎడిటర్ కాడేపాగు అశోక్
ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ



తెలంగాణ - ఆంధ్ర ప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 169 చీఫ్ ఎడిటర్: కాడేపాగు అశోక్ పేజిలు : 04, వెల రూ. 4రూ/ శనివారం- 16 - మే - 2026

Published From Kurnool : Circulated at 'Kurnool Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram,

## మోదీ సర్కార్ చేసిన తప్పిదానికి ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు'
## పెట్రో ధరల పెంపుపై రాహుల్ గాంధీ ఫైర్



'ప్రస్తుతం పెట్రోల్ , డీజిల్ ధరలు పెంచి షాక్ ఇచ్చారు- మిగిలిన వసూళ్లు వాయిదాల పద్ధతిలో జరుగుతాయ్' – రాహుల్ గాంధీ ఎద్దేవా

ఢిల్లి : పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ శుక్రవారం మోదీ సర్కార్ పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం చేసిన తప్పునకు సామాన్య ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారని విమర్శించారు. పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగిపోయాయి. దీనితో ప్రభుత్వ రంగ ఇంధన సంస్థలు ఆ భారంలో కొంత భాగాన్ని వినియోగదారులపైకి నెట్టాయి. దీనితో పెట్రోల్, డీజిల్ ధరలు లీటర్ కు రూ.3 చొప్పున పెరిగాయి. మిగతా..2లో

## నా పేరు వాడొద్దు... కోర్టును ఆశ్రయించిన బండి సంజయ్



పోక్సో కేసులో తన పేరును ఉపయోగించకుండా చూడాలని పిటిషన్

ఇప్పటి వరకు వాడిన వీడియోలు తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి

తన కుమారుడి వివాదంలో తన పేరు ఉపయోగించకుండా ఉత్తర్వులివ్వాలన్న బండి సంజయ్

ఢిల్లి : కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు. పోక్సో కేసులో భవిష్యత్తులో మిగతా..2లో

## బుల్లెట్ ట్రైన్ కారిడార్లపై
## సీఎస్ కీలక సమీక్ష!



★ హైదరాబాద్ కేంద్రంగా ముంబై, బెంగళూరు, చెన్నై హైస్పీడ్ రైలు ప్రాజెక్టులపై సీఎస్ సమీక్ష నిర్వహించారు.

★ భూసేకరణ వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశించారు.

హైదరాబాద్: : తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ సంయుక్త భాగస్వామ్యంతో చేపట్టబోతున్న మూడు భారీ హైస్పీడ్ రైలు (బుల్లెట్ రైలు) కారిడార్ ప్రాజెక్టుల తుది ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. తెలంగాణను ఆర్థికంగా మరింత బలోపేతం చేసే లక్ష్యంతో హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదించిన మూడు భారీ హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం

## కేసీఆర్ సీఎం అయ్యాక ప్రజలకు
# దూరమయ్యారన్న కవిత

● పరిపాలన కాలంలో కేసీఆర్ యంత్రంలా పని చేశారని వ్యాఖ్య

● ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప నాయకుడు, !

● అందుకే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదన్న కవిత



హైదరాబాద్: ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ చాలా గొప్ప వ్యక్తి అని, అందులో ఎవరికీ అనుమానాలు లేవని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. కానీ ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ప్రజలకు క్రమంగా దూరమయ్యారని అన్నారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పరిపాలన కాలంలో కేసీఆర్ ఒక యంత్రంలా మాత్రమే పనిచేశారని అన్నారు. అందువల్లే ఆయనకు ప్రజల భావోద్వేగాలు అర్థం కాలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన ఎంతో కఠినంగా ఉండేవారని అన్నారు. కన్నబిడ్డగా సమస్యలు చెప్పుకునే అవకాశం తనకే ఇవ్వలేదని గుర్తు చేసుకున్నారు. కుటుంబ సభ్యులకే అందుబాటులో లేని వ్యక్తి, ఇక సామాన్య ప్రజల కష్టాలను ఎలా వింటారని ప్రశ్నించారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడి నుంచి ఒక యంత్రం లాంటి ముఖ్యమంత్రిగా మారిన తీరే ప్రస్తుత రాజకీయ పరిణామాలకు కారణమని అన్నారు.

## బండి సంజయ్, కిషన్ రెడ్డి
# దొంగ ఓట్లతో గెలిచారు

★ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని మహేష్ గౌడ్

★ గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని ఆరోపణ

★ బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని వ్యాఖ్య



హైదరాబాద్: తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాల్లో మూడో దశ ఎస్ఐఆర్ నిర్వహణకు షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో, శుక్రవారం కాంగ్రెస్ ప్రతినిధి బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని మిగతా..2లో

## ఐఎండీ చల్లని కబురు- ఈనెల 26న కేరళను
# తాకనున్న నైరుతి రుతుపవనాలు


❖ ఈ ప్రక్రియ అంచనా తేదీకి నాలుగు రోజుల ముందుగా లేదా ఆలస్యంగా జరిగే అవకాశం కూడా ఉందని ప్రకటన

❖ తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుందని వెల్లడి



ఢిల్లి: ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు చల్లని కబురు అందించింది భారత వాతావరణ శాఖ. నైరుతి రుతుపవనాలు మే 26న కేరళలో ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది. మే 26న రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ, వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దీనికి నాలుగు రోజుల అటు ఇటుగా అంటే మే 22 నుంచి మే 30 మధ్య రుతుపవనాలు తాకే అవకాశం ఉండవచ్చని ఐఎండీ వివరించింది. సాధారణంగా కేరళలో రుతుపవనాలు జూన్ 1 నాటికి ప్రవేశిస్తాయి. అక్కడి నుంచి ఉత్తరం వైపునకు విస్తరిస్తూ దేశంలోని మిగిలిన ప్రాంతాలకు చేరతాయి. కేరళలో రుతుపవనాల ప్రవేశం ద్వారా దేశంలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే వర్షాకాలం అధికారికంగా ప్రారంభమవుతుంది. రుతుపవనాల రాకపై స్పష్టత రావడంతో దేశవ్యాప్తంగా అన్నదాతలు ఖరీఫ్ సాగు పనులకు సిద్ధమవుతున్నారు. కాగా, గతేడాది రుతుపవనాలు మిగతా..2లో

## సోమ, శుక్రవారాల్లో ఆన్‌లైన్ విచారణలు
## సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు



● ఇంధన పొదుపు చర్యలు చేపట్టిన సుప్రీంకోర్టు

● ఇకపై వారంలో రెండు రోజులు ఆన్‌లైన్‌లోనే కేసుల విచారణ

● విచారణ లింక్‌లను సకాలంలో పిటిషనర్లకు పంపించాలని ఆదేశాలు జారీ

ఢిల్లి : సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు చేపట్టింది. ఇక నుంచి వారంలో రెండు రోజుల పాటు ఆన్‌లైన్‌లోనే

## కాంగ్రెస్‌ను కేంద్రంలో
# అధికారంలోకి తేవడమే లక్ష్యం

❖ గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు..

❖ కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు.



హైదరాబాద్, మే 15 : గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు. (శుక్రవారం) హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. మిగతా..2లో

## వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు...
## వాళ్లది పవర్ ఫుల్ కాంబో



★ పుట్టపర్తిలో ఏఎంసీఏ స్టెల్ ఫైటర్ జెట్ ప్రాజెక్ట్‌కు భూమిపూజ

★ మోదీ, రాజ్ నాథ్, చంద్రబాబు 75 ఏళ్ల కుర్రాళ్లు అంటూ లోకేష్ ప్రశంసలు

★ వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ తట్టుకోలేమన్న లోకేష్

★ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ఐరన్ మ్యాన్‌గా అభివర్ణణ

## ఐదో తరం విమానాలు గగనంలో
# ఎగరబోతున్నాయి

● పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు

● ఏపీ అభివృద్ధికి చంద్రబాబు వంటి నిబద్ధత కలిగిన నాయకుడు ఉండాలని వెల్లడి

### పుట్టపర్తి వేదిక కాబోతోంది




అమరావతి : పుట్టపర్తి నుంచి ప్రపంచంలోని ప్రతి మూలకు డ్రోన్ సరఫరా చేసే క్షణం రాబోతోందని కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. సమగ్ర సంపూర్ణ ప్రాంతీయ అభివృద్ధి త్వరలోనే సాకారం కాబోతోందని తెలిపారు. సత్యసాయి జిల్లాలోని పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. మిగతా..2లో

## ఏపీకి ఏఎంసీఏ ప్రాజెక్టు..
## ఎక్స్‌లో పవన్ కల్యాణ్ స్పందన




రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే ప్రయాణంలో ఏఎంసీఏ ప్రాజెక్టు కీలకమైన మైలురాయి అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభివర్ణించారు.

అమరావతి, మే 15: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. పుట్టపర్తిలో రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 7,500 మంది ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏఎంసీఏ ప్రాజెక్టుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా

మొదటి పేజి తరువాయి

## ఏపీకి ఏఎంసీఏ ప్రాజెక్టు.. ఎక్స్‌లో పవన్ కల్యాణ్ స్పందన

రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పవన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

### పవన్ ట్వీట్..

'రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే ప్రయాణంలో ఇది ఒక కీలకమైన మైలురాయి. రూ.15,800 కోట్ల పెట్టుబడితో 650 ఎకరాలలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ & ఫ్లైట్ టెస్ట్ సెంటర్‌తో పాటు ప్రధాన రక్షణ, డ్రోన్ ఎకోసిస్టమ్ ప్రాజెక్టులను స్థాపించడం అనేది, నవకల్పన ఆధారిత వృద్ధి, వ్యూహాత్మక స్వావలంబన దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగు. సాంకేతిక పురోగతిని వేగవంతం చేయడంతో పాటు, 7,500కు పైగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని అంచనా. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. భారతదేశ వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రను బలోపేతం చేయడానికి నిరంతరం మద్దతు ఇస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్... పారిశ్రామిక వృద్ధి, ఆవిష్కరణలు, భవిష్యత్తు - సిద్ధ పెట్టుబడుల కోసం తన దార్శనికతను బలోపేతం చేస్తూనే ఉంది' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## వాళ్లు ముగ్గురు 75 ఏళ్ల కుర్రాళ్లు...
## వాళ్లది పవర్ ఫుల్ కాంబో

అమరావతి : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు.. వీరంతా 75 ఏళ్ల కుర్రాళ్లు అంటూ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వారి వయసు 75 ఏళ్లయినా, వారిలో 25 ఏళ్ల యువకులు ఉన్నారని, వారి స్పీడ్ చూస్తుంటే తనకు ఆశ్చర్యం వేస్తుందని అన్నారు. ఈ ముగ్గురి వేగాన్ని తట్టుకోవడం ఎవరి వల్లా కాదని లోకేష్ వ్యాఖ్యానించారు. వీరిది పవర్ ఫుల్ కాంబినేషన్ అని కొనియాడారు. పుట్టపర్తిలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు భూమిపూజ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో కలిసి లోకేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి అనంతపురం జిల్లా చరిత్ర మారబోతోందని లోకేష్ అన్నారు. రక్షణ రంగంలో పెద్దఎత్తున పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు రానున్నాయని, యువత ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా, పాకిస్థాన్‌కు గట్టి జవాబిచ్చిన 'ఆపరేషన్ సిందూర్'ను గుర్తుచేస్తూ, దాని వెనుక ఉన్న అసలైన శక్తి, ఐరన్ మ్యాన్ కేంద్ర మంత్రి రాజ్ నాథ్ సింగ్ అని లోకేష్ ప్రశంసించారు. ఈ కార్యక్రమం ద్వారా ఏపీ అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## బండి సంజయ్, కిషన్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచారు

కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... గత ఎన్నికల్లో పారదర్శకత లోపించిందని, బెంగాల్ ఎన్నికలే దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ నేతలు బండి సంజయ్, కిషన్ రెడ్డి 'దొంగ ఓట్ల' సహాయంతోనే గెలిచారని ఘాటుగా ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికలు లేనందున, ఈ సవరణ ప్రక్రియను తొందరపాటుతో కాకుండా ఏడాది పొడవునా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### వినతిపత్రంలోని ప్రధాన సూచనలు:

గత 25 ఏళ్లలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగినందున, ఈ ప్రక్రియను ఒకటిన్నర సంవత్సరం నుంచి నుంచి 2 ఏళ్ల పాటు దశలవారీగా చేపట్టాలి. బూత్ లెవల్ ఆఫీసర్లు జియో-ట్యాగ్ ఫొటోలతో కనీసం మూడుసార్లు గృహ సందర్శన చేసి భౌతిక ధృవీకరణ చేయాలి. ఓటును తొలగించే ముందు ఏడు రోజుల ముందస్తు రాతపూర్వక నోటీసు తప్పనిసరిగా ఇవ్వాలి. అభ్యంతరాల స్వీకరణకు కనీసం నెల రోజులు గడువు ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. రాజకీయ పార్టీలకు 2002 మరియు 2025 నాటి ఓటర్ల జాబితాల సాఫ్ట్ మరియు హార్డ్ కాపీలను అందించాలి. అబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్ జాబితాలను సకాలంలో పార్టీలకు అందజేయాలి. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల ఓట్లు తొలగిపోకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 2002 తర్వాత రాష్ట్రానికి వలస వచ్చి, కనీసం రెండుసార్లు ఓటు వేసిన వారికి అఫిడవిట్ ప్రాతిపదికన ఓటు హక్కు కల్పించాలి. జనాభా గణన, ఎస్ఐఆర్ విధులను వేర్వేరు అధికారులు నిర్వహించాలి. ఒకే అధికారికి రెండు బాధ్యతలు అప్పగించకూడదని కాంగ్రెస్ నేతలు కోరారు.

## కాంగ్రెస్‌ను కేంద్రంలో అధికారంలోకి తేవడమే లక్ష్యం

వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు.ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యూమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## నా పేరు వాడొద్దు... కోర్టును ఆశ్రయించిన బండి సంజయ్

తన పేరును వాడకుండా చూడాలని పిటిషన్ వేశారు. అలాగే తన పేరుతో ఇప్పటి వరకు వాడిన వీడియోలను తొలగించేలా ఆదేశాలు జారీ చేయాలని కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కుమారుడిపై నమోదైన కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కాబట్టి ఈ వివాదంలో తన పేరును ఎక్కడా ఉపయోగించకుండా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఇదిలా ఉండగా, బండి భగీరథ్ కేసులో బాలిక వివరాలు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం కావడంపై కేసు నమోదైంది. బాలిక ఫొటోలు, వీడియోలు, తల్లిదండ్రుల వివరాల ప్రసారంపై కేసు నమోదు చేశారు. మేడ్చల్ జిల్లా బాలల సంక్షేమ కమిటీ ఛైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు సోషల్ మీడియా ఖాతాల నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపారు.

## అస్తిత్వ పోరాటమా... అవకాశవాదమా?

డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు రెండు దశాబ్దాలపాటు (అడపాదడపా మిత్రభేదం మినహాయిస్తే) కలిసి రాజకీయ ప్రయాణం చేశాయి. భాజపా వ్యతిరేక జాతీయ సంఘటనలో కాంగ్రెస్‌కు స్టాలిన్ నమ్మదగిన మిత్రుడు. కాలపరీక్షకు నిలబడిన భావసారూప్యత కలిగిన భాగస్వామి. అలాంటి మిత్రుణ్ని తమిళనాడు ఎన్నికల తరవాత దూరం చేసుకుని టీవీకే నేత విజయ్‌కు దగ్గరై హస్తం పార్టీ సాధించేది ఏముందనే చర్చ దేశవ్యాప్తంగా సాగుతోంది. అయితే, కాంగ్రెస్ కొత్త మిత్రుడితో చెయ్యి కలపడం హఠాత్తు నాటకీయ పరిణామంగా పైకి కనపడుతున్నా అంతా ప్రణాళికాబద్ధంగానే జరిగినట్టు అర్థం అవుతోంది. డీఎంకేతో రెండు దశాబ్దాల మైత్రి వల్ల తమిళనాడులో కాంగ్రెస్ బావుకున్నది ఏముందనే ఆవేదన ఆ పార్టీలో మొదలైంది. స్నేహం వల్ల ఉభయులూ లబ్ధి పొందాలి. కానీ తాము పదవులను అనుభవిస్తూ మిత్రపక్షమైన కాంగ్రెస్‌ను మాత్రం డీఎంకే అధికార సౌధానికి ఆమడ దూరాన ఉంచేసింది. దాంతో ఒక చక్రబంధంలో ఇరుక్కుని ఊపిరాడని పరిస్థితిలో జాతీయపార్టీ ఉండిపోయింది. ఒకరకంగా చెప్పాలంటే డీఎంకేనే కాంగ్రెస్‌కు పొగబెట్టి తనకుతానుగా బయటకు వెళ్లే స్థితిలోకి నెట్టేసింది. మరి విజయ్‌తో చేతులు కలిపితే కాంగ్రెస్‌కు వచ్చే లాభం ఏంటి? టీవీకేతో మైత్రి ఒప్పందం ప్రకారం రాష్ట్ర స్థాయిలో అధికార భాగస్వామ్యంతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయి. అన్ని స్థాయుల్లోనూ అధికారాన్ని పంచుకుంటాయి. అదే జరిగితే అయిదు దక్షిణాది రాష్ట్రాలలో నాలుగింటిలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నట్టే. ఆరు దశాబ్దాల తరవాత తమిళనాడు ప్రభుత్వంలో భాగస్వామి అవుతుంది. విజయ్ సామాజిక నేపథ్యం కూడా కాంగ్రెస్‌కు కలిసొస్తుంది. కామరాజ్ నాడార్ తరహా రాజకీయాలకు హస్తం పార్టీ ఇప్పుడు తమిళనాడులో శ్రీకారం చుట్టవచ్చు.

పూలమ్మిన చోట కట్టెలమ్మే స్థితిలో...

ఓడలు బళ్లు అవుతాయి, బళ్లు ఓడలు అవుతాయి అంటారు కదా! తమిళనాడులో ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి అదే. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు నుంచి కూడా తమిళనాడులో కాంగ్రెస్ ఒక వెలుగు వెలిగింది. నెహ్రూ సమకాలికులైన రాజాజీ, కామరాజ్ నాడార్ లాంటి నాయకులు తమిళ నేలపై కాంగ్రెస్ నీడలో ఎదిగారు. స్వతంత్ర భారతంలో కూడా రెండు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌కు తమిళనాడు బ్రహ్మరథం పట్టింది. ఇంకా చెప్పాలంటే, ఆ ఇరవయ్యేళ్ల కాలం ఆ రాష్ట్రంలో హస్తం పార్టీకి స్వర్ణయుగం లాంటిది. అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షుడిగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా పార్టీని కామరాజ్ సామాజిక న్యాయం దిశగా నడిపించారు. అట్టడుగు వర్గాల్లో కాంగ్రెస్ బలమైన పట్టు సాధించడానికి ఆయన సామాజిక నేపథ్యం ఉపకరించింది. అదే సమయంలో పెరియార్ ఈవీ రామస్వామి ప్రభావంతో కులాతీత ఆత్మగౌరవం ప్రాతిపదికన తమిళనాట ద్రావిడ రాజకీయాలు వేళ్లూనుకున్నాయి. రాష్ట్రాల అధికారాలు, హక్కులు, ఆయా ప్రాంతాల ప్రజల మనోభావాలకు జాతీయ ప్రధాన స్రవంతిలో చోటు కల్పించడంలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమైంది. ఫలితంగా ద్రావిడ అస్తిత్వ ఉద్యమాలు ఊపందుకున్నాయి. అదే సమయంలో నాయకత్వ మార్పు కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యానికి విఘాతంగా పరిణమించింది. అసమ్మతి గళాలకు ఊపిరాడని పరిస్థితి ఏర్పడింది. ఇందిరాగాంధీ ప్రధాని కావడానికి కీలకంగా వ్యవహరించిన నాయకుల్లో కామరాజ్ ఒకరు. అలాంటి ఆయన కూడా ఇందిర నాయకత్వ పోకడలు నచ్చక కాంగ్రెస్ నుంచి బయటికి వెళ్లిపోయారు. ఇలా అనేకానేక ప్రతికూల పరిస్థితుల ప్రభావం వల్ల తమిళనాడులో కాంగ్రెస్ క్రమేణా ప్రజాదరణ కోల్పోయింది. జాతీయ భాష అంటూ హిందీకి ప్రాధాన్యమివ్వడానికి కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రయత్నించడం కూడా రాష్ట్రంలో ఆ పార్టీకి చేటుచేసింది. అన్నాదొరై డీఎంకే పార్టీని ఏర్పాటుచేసిన తరవాత కాంగ్రెస్‌కు రాష్ట్రంలో దాదాపుగా నూకలు చెల్లిపోయాయి. ద్రావిడ సెంటిమెంటుతో 1967 ఎన్నికల్లో అన్నా విజయభేరి మోగించారు. అలా ఒక ప్రాంతీయ పార్టీ నాయకత్వంలో దేశంలో మొదటి కాంగ్రెసేతర ప్రభుత్వం ఏర్పాటైంది. ఆ ఎన్నికల్లో బలంగా వీచిన కాంగ్రెస్ వ్యతిరేక పవనాల కారణంగా కామరాజ్ సైతం ఒక విద్యార్థి నాయకుడి ..

# ఐదో తరం విమానాలు గగనంలో ఎగరబోతున్నాయి

మొదటి పేజి తరువాయి



ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజ్‌నాథ్‌సింగ్ తెలుగులో ప్రసంగం ప్రారంభించి ఎలా ఉన్నారు అంటూ ప్రజలను పలకరించారు. ఈ రోజు చరిత్రాత్మకమైన రోజు అని ఒక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ఇవాళ అనేక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసుకున్నట్లు రాజ్‌నాథ్ వెల్లడించారు. విద్య, సేవ, ఆధ్యాత్మికతతో పుట్టపర్తి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిందని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. చంద్రబాబు వంటి దూరదృష్టి కలిగిన నాయకుడిని ఎక్కడా చూడలేదని ఏపీ అభివృద్ధికి ఇటువంటి నిబద్ధత కలిగిన నాయకుడు ఉండాలని కొనియాడారు. చంద్రబాబు దృక్పథం శాస్త్రీయమైనదని ఎన్నో అంతర్జాతీయ సంస్థలు ఈయన కృషిని గుర్తించాయని చెప్పారు. చంద్రబాబు వల్లే గూగుల్ రూ.లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టబోతుందని అన్నారు. ఏపీ అంటే అడ్వాన్స్ ఆంధ్రప్రదేశ్‌గా మారబోతుందని పేర్కొన్నారు. దేశ నిర్మాణం, సమష్టి కృషి, విశ్వ సోదర భావన స్ఫూర్తితో ముందుకెళ్దామని రాజ్‌నాథ్ సూచించారు. డ్రోన్ హబ్‌గా కర్నూలు: కొన్నేళ్లక్రితం రక్షణ రంగంలో ప్రపంచంలోనే అతిపెద్ద దిగుమతిదారుగా ఉండేవాళ్లమని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. యుద్ధసమయంలో సొంత భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వచ్చేదని కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి గత పదేళ్లుగా చేసిన కఠోర శ్రమకు ఫలితాలు వస్తున్నాయని వెల్లడించారు. 2004లో కేవలం భారత్ రూ.46 వేల కోట్ల విలువైన ఆయుధ పరికరాలు తయారీ ఉండేదని ప్రస్తుతం రికార్డు స్థాయిలో లక్షా రూ.75 వేల కోట్లకు పెరిగిందని గర్వంగా చెబుతున్నామని అన్నారు. రక్షణ రంగంలో సంపూర్ణ స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామని వెల్లడించారు. పబ్లిక్, ప్రైవేటు రంగాలు చేయిచేయి కలిపి నడుస్తున్నాయని గత పదేళ్లలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల మధ్య అంతరాన్ని తగ్గించామని వివరించారు. దేశ రక్షణ అనే మహత్తర యజ్ఞంలో ప్రతిఒక్కరూ తమ సహకారం అందిస్తున్నారని రాజ్‌నాథ్ అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య నమూనా రక్షణ రంగ తయారీకి ప్రజా ఉద్యమంగా మారిందని స్థానిక యువతకు అత్యాధునిక సాంకేతికత అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. ఏపీ సంపూర్ణ అభివృద్ధికి దోహదపడేలా ఈ పరిశ్రమలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో డ్రోన్ సిటీ ప్రారంభానికి సిద్ధమయ్యాయని వెల్లడించారు. యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని ఆర్థిక వ్యవస్థ, వ్యవసాయరంగంలో కూడా డ్రోన్ పాత్ర కీలకంగా మారిందని అన్నారు. ఇకనుంచి కర్నూలును డ్రోన్ హబ్‌గా పిలుస్తారని కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ తెలిపారు. "ఐదో తరం విమానాలు గగనంలో ఎగరబోతున్నాయి. పుట్టపర్తి కూడా వేదిక కాబోతోంది. కనురెప్పపాటులో శత్రువులను నాశనం చేసే విమానాలు ఉత్పత్తి కాబోతున్నాయి. భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రాజెక్టు రక్షణ మంత్రిత్వశాఖ ప్రతిష్టాత్మక ప్రభుత్వ రంగ సంస్థ. రూ.480 కోట్లు పెట్టుబడులతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ రాబోతోంది. ఈ సంస్థల వల్ల ఇతర దేశాల నుంచి దిగుమతులు తగ్గుతాయి. హెచ్ఎఫ్‌సీఎల్ రూ.1,294 కోట్ల పెట్టుబడితో రాబోతోంది. ఆయుధాల తయారీరంగంలో స్వావలంబన దిశగా కొత్త అధ్యయనం ప్రారంభం కాబోతోంది.

# బుల్లెట్ ట్రైన్ కారిడార్లపై సీఎస్ కీలక సమీక్ష!

మొదటి పేజి తరువాయి

నిర్వహించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్:

హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ తెలిపారు.

### ఆ రూట్లలో డీపీఆర్ సిద్ధం:

హైదరాబాద్ పూనే ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డీపీఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సుమారు 671 కి. మీటర్ల మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ బెంగళూరు కారిడార్, హైదరాబాద్ చెన్నై కారిడార్ లో సుమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్.యం.డి.ఎ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని



సీఎస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, ఎవీణూ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.

# ఐఎండీ చల్లని కబురు- ఈనెల 26న కేరళను తాకనున్న నైరుతి రుతుపవనాలు

మొదటి పేజి తరువాయి

మే 24న ప్రవేశించినట్లు ఆ శాఖ వెల్లడించింది.

తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం

రాబోయే 24 గంటల్లో దక్షిణ బంగాళాఖాతం, అండమాన్ నికోబార్ దీవుల ప్రాంతాల్లోకి రుతుపవనాలు విస్తరించడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని కూడా వాతావరణ శాఖ తెలిపింది. "భారత ప్రధాన భూభాగంలోకి నైరుతి రుతుపవనాల విస్తరణ అనేది కేరళలో వాటి ఆగమనంతో గుర్తిస్తాం. వేడి, పొడి వాతావరణం నుంచి వర్షాకాలంలోకి జరిగే మార్పును సూచించే ఒక ముఖ్యమైన సూచిక ఇది. రుతుపవనాలు ఉత్తరం వైపుగా విస్తరిస్తున్న కొద్దీ, ఆయా ప్రాంతాల్లో వేసవిలో ఉండే తీవ్రమైన ఉష్ణోగ్రతల నుంచి ఉపశమనం లభిస్తుంది." అని ఐఎండీ పేర్కొంది.

### సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం

ఈ ఏడాది రుతుపవన కాలంలో భారతదేశంలో సాధారణ స్థాయి కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. దేశంలో తక్కువ వర్షపాతానికి కారణమయ్యే 'ఎల్ నినో' పరిస్థితులు



ఏర్పడటమే దీనికి కారణం కావచ్చునిఅభిప్రాయపడింది. రుతుపవన కాలాల్లో దేశంలో సాధారణంగా సుమారు 80 సెం.మీ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంటుంది. కాగా, ఈ రుతుపవన కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు (1971-2020 మధ్య కాలం) 87 సెం.మీగా ఉంది. దేశ వ్యవసాయ ఆధారిత ఆర్థికవ్యవస్థకు జీవనాడిగా నైరుతి రుతుపవనాలను పిలుస్తారు. నాలుగు నెలల పాటు సాగే ఈ రుతుపవన కాలం దేశానికి లభించే వార్షిక వర్షపాతంలో దాదాపు 70 శాతాన్ని అందిస్తుంది. వ్యవసాయానికి, పంటలకు, మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థకు, అలాగే జలాశయాలు, భూగర్భ జలాలను తిరిగి నింపడానికి ఇది అత్యంత కీలకం. మన దేశంలో 50 శాతానికి పైగా నికర సాగుభూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశం మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40శాతం దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి.

### 92 శాతం వర్షపాతం మాత్రమే నమోదయ్యే అవకాశం

ఇదిలా ఉండగా, దేశ వ్యవసాయ రంగానికి కీలకమైన నైరుతి రుతుపవనాలపై ఎల్ నినో ప్రభావం పడనుందని ఇప్పటికే భారత వాతావరణ శాఖ(ఐఎండీ) వెల్లడించింది. ఈ ఏడాది జూన్- సెప్టెంబర్ లో నైరుతి రుతుపవనాల వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని తెలిపింది. దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం 92 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర తెలిపారు. ఫలితంగా దేశంలోని వ్యవసాయం, నీటి వనరులు, పర్యావరణంపై గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని చెప్పింది.

## మోదీ సర్కార్ చేసిన తప్పిదానికి ప్రజలు మూల్యం చెల్లిస్తున్నారు'
# పెట్రో ధరల పెంపుపై రాహుల్ గాంధీ ఫైర్

మొదటి పేజి తరువాయి

గత నాలుగేళ్లు లేదా అంత కంటే ఎక్కువ కాలంలో ఇంధన ధరలు పెరగడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. అయితే దీనిపై లోక్ సభలో ప్రతిపక్ష నేత అయిన రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. "మోదీ ప్రభుత్వం తప్పు చేసింది. ప్రజలు మూల్యం చెల్లించుకుంటున్నారు. ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలపై రూ.3 పెంచి షాక్ ఇచ్చారు. మిగిలిన వసూళ్లు వాయిదాల పద్ధతిలో జరుగుతాయి."

**- రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత,**

సీఎన్ జీ ధరలు కూడా పెరిగాయ్ మరోవైపు దిల్లీ, ముంబయి లాంటి నగరాల్లో సీఎన్ జీ ధరలు కూడా కిలోకు రూ.2 చొప్పున పెంచారు. పరిశ్రమ వర్గాల ప్రకారం, దిల్లీలో పెట్రోల్ ధర లీటర్ కు రూ.94.77 నుంచి రూ.97.77కు పెరిగింది. లీటర్ డీజిల్ ధర రూ.87.67 నుంచి ఇప్పుడు రూ.90.67కు చేరింది. అయితే రాష్ట్రాలు విధించే 'విలువ ఆధారిత పన్ను' (వ్యాట్)లో ఉన్న వ్యత్యాసాల కారణంగా ఈ ధరలు ఆయా రాష్ట్రాలను బట్టి మారుతుంటాయి. ఫిబ్రవరి 28న ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దాడులు చేశాయి. తర్వాత ఇరాన్ కూడా ప్రతిదాడులకు దిగి, హర్మూజ్ జలసంధిని దిగ్బంధనం చేసింది. దీనితో అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ గుండా చమురు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీని ఫలితంగా ప్రపంచ మార్కెట్లో ముడిచమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగాయి. అయితే, పశ్చిమాసియా ఉద్రిక్తతలు వల్ల ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు పెరిగినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం మాత్రం దేశీయ ఇంధన సంస్థలు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచకుండా చూసింది. అయితే నాలుగు రాష్ట్రాలు, ఓ కేంద్రపాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందువల్లనే కేంద్రం ఇంధన ధరలు పెంచలేదని, దీని వెనుక రాజకీయ ప్రయోజనాలు దాగున్నాయని, అప్పట్లోనే ప్రతిపక్షాలు ఆరోపించాయి. దీని తర్వాత బంగాల్ , అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయకేతనం ఎగురువేసి, ప్రభుత్వాలను ఏర్పాటుచేసింది. బంగాల్ లో అయితే మొదటిసారి కాషాయపార్టీ తన జెండాను పాతగలిగింది. అయితే విపక్షాలు అన్నట్లుగానే, అసెంబ్లీ ఎన్నికలు అయిన తర్వాత మోదీ సర్కార్ , ఇంధన ధరలు పెంపు నిర్ణయం తీసుకుంది. దీనితో 2022 మే తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు అత్యంత గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి.

### రూ.3 పెంపు సరిపోతుందా?

తాజాగా పెంచిన ధరలు చాలా మంది భారతీయులకు భారంగా మారాయన్నది వాస్తవం. అయితే లీటర్ పెట్రోల్, డీజిల్ పై రూ.3 పెంపు అనేది చాలా ఎక్కువగా అనిపిస్తున్నప్పటికీ, వాస్తవానికి ఇది ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఓఎంసీ) భరిస్తున్న నష్టాన్ని తీర్చలేదని నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే, పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముందు ఓఎంసీలు మంచి లాభాల్లో ఉన్నాయి. కానీ యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రతి ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ నష్టాలను భరిస్తూ వస్తోంది. ఈ యుద్ధం ఇంకొన్నాళ్లు కొనసాగితే, ప్రతి కంపెనీ తీవ్రమైన నష్టాలకు, ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది. నిపుణుల ప్రకారం, యుద్ధానికి ముందు బ్యారెల్ ముడిచమురు ధర సగటున 69 డాలర్లుగా ఉండగా, ఈ ఏప్రిల్ లో సగటున 114.48 డాలర్లకు, మే నెలలో ఇప్పటి వరకు సగటున 105.87 డాలర్లకు చేరుకుంది. దీని వల్ల ఓఎంసీలు భారీగా నష్టపోతున్నాయి. ఈ భారీ నష్టాలను పూడ్చుకోవాలంటే, లీటర్ పెట్రోల్ ధర రూ.28లు, లీటర్ డీజిల్ ధర రూ.33 వరకు పెంచితేకాని ఏఎంసీలకు బెనిఫిట్ ఉండదు. అయితే ప్రస్తుత భారత రాజకీయ వాతావరణంలో, ఇంతటి భారీ స్థాయిలో ఇంధన ధరలు పెంచడం సాధ్యం కాదని నిపుణులు అంటున్నారు.

## సోమ, శుక్రవారాల్లో ఆన్‌లైన్ విచారణలు- సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు

మొదటి పేజి తరువాయి

కేసుల విచారణ చేపట్టాలని నిర్ణయించింది. సోమ, శుక్రవారాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేసులను విచారిస్తామని తెలిపింది. ఈ మేరకు సుప్రీంకోర్టు రిజిస్ట్రీ సర్క్యులర్ జారీ చేశారు. ఆన్‌లైన్ విచారణ కోసం లింక్‌లను సకాలంలో పిటిషనర్లకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. విచారణ సమయంలో సాంకేతిక అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్దేశించింది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల వేళ ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపు చేపట్టాలని ప్రధాని మోదీ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు సుప్రీంకోర్టు ఇంధన పొదుపు చర్యలు చేపట్టింది. ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు సీజేఐ సహా ఇతర న్యాయమూర్తులు కార్ పూలింగ్ విధానాన్ని అనుసరించనున్నారు. రిజిస్ట్రీలోని వివిధ విభాగాల్లో పనిచేసే ఉద్యోగుల్లో 50 శాతం మందికి వారంలో రెండ్రోజుల పాటు వర్క్ ఫ్రం హోం విధానాన్ని సుప్రీంకోర్టు ప్రకటించింది. ఇందుకోసం వీక్లీ రోస్టర్‌ను తయారు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఇళ్ల నుంచి పనిచేసే వారు ఎల్లప్పుడూ ఫోన్ ద్వారా అందుబాటులో ఉండాలని, అవసరమైతే వెంటనే కార్యాలయానికి రావాల్సి ఉంటుందని తెలిపింది. సంబంధిత అధికారులు తమకు అప్పగించిన పనులను సకాలంలో పూర్తి చేసేలా నిర్ధారించుకోవాలని రిజిస్ట్రీకి సూచించింది. అయితే, వర్క్ ఫ్రం హోమ్ సమర్థవంతంగా లేదని సంబంధిత రిజిస్ట్రార్ అభిప్రాయపడితే, ఆయా శాఖ లేదా విభాగానికి అటువంటి ఏర్పాట్లను పరిమితం చేయవచ్చు లేదా సవరించవచ్చునని సర్క్యూలర్ లో పేర్కొంది. పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు సుప్రీంకోర్టు ఈ చర్యలు చేపట్టింది.

ఇంధన సంక్షోభంపై మోదీ సూచనలు

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభం తలెత్తింది. ఈ క్రమంలో భవిష్యత్ లో దేశంలో ఇంధన కొరత తలెత్తకుండా ప్రధాని మోదీ పలు కీలక సూచనలు చేశారు. ఇంధనం పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగులు వర్క్ ఫ్రం హోమ్ కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే, ఏడాది పాటు బంగారం కొనవద్దని చెప్పారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎప్పుడైనా పెరిగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. చిన్న చిన్న చర్యలతో దేశానికి మేలు చేయవచ్చునని అన్నారు.

ప్రధాని పిలుపునకు విశేష స్పందన

అయితే, ప్రధాని మోదీ పిలుపునకు విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటికే ప్రధాని మోదీ సహా పలు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు తమ కాన్వాయ్‌లలోని వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించుకున్నారు. తాజాగా గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రజా రవాణాకు ప్రాధాన్యమిచ్చి, కాన్వాయ్‌ని వాడకుండా రైలులో ప్రయాణించి కురుక్షేత్రకు వెళ్లారు. అనంతరం రైల్వే స్టేషన్ నుంచి సైకిల్ తొక్కుతూ గురుకుల్ చేరుకున్నారు. ఆయన భద్రతా సిబ్బంది సైతం సైకిల్‌పైనే గవర్నర్‌ను అనుసరిస్తూ తమ విధులను నిర్వర్తించారు.

దిల్లీలో వర్క్ ఫ్రం హోమ్

మరోవైపు, దిల్లీ ప్రభుత్వం కూడా ఇప్పటికే అనేక పొదుపు చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఉద్యోగులకు వారంలో రెండు రోజులు వర్క్ ఫ్రం హోమ్ ప్రకటించింది. ప్రతి సోమవారం మెట్రోలో కార్యాలయాలకు రావాలని ఉద్యోగులకు సూచించింది. అధికారుల వాహనాలకు ఇచ్చే పెట్రోల్, డీజిల్‌లో 20 శాతం కోత విధించింది.

వార్త నిర్భయం

శనివారం 16 మే 2026

## బాధిత కుటుంబానికి మేఘాన్న అభయహస్తం ద్వారా రూ.5 వేల ఆర్థిక సహాయం..

**ఏదుల మండలంలో మృతి చెందిన ఎర్రమోని బిసయ్య కుటుంబానికి చేయూత.**

**కాంగ్రెస్ నేత పందెం సుఖేందర్ రెడ్డి.సర్పంచ్ కాటమోని పరశురామ్ యాదవ్,**



ఏదుల, మే 15 (వార్త నిర్భయం) ఏదుల మండల కేంద్రానికి చెందిన ఎర్రమోని బిసయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు.ఏదుల మండల కాంగ్రెస్ నాయకుడు పందెం సుఖేందర్ రెడ్డి దృష్టికి తీసుకురాగా, ఆయన ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సూచన మేరకు మేఘాన్న అభయహస్తం ద్వారా ఈ సహాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఏదుల గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్ యాదవ్, దూరల రాముడు, వార్డు మెంబర్ రాముడు యాదవ్, మాజీ వార్డు మెంబర్ మల్లయ్య, కేత్మలా గోపాల్, మునేష్, బొల్లె క్రిష్ణయ్య, కావాలి శ్రీను, గువ్వల హన్మంతు తదితర కాంగ్రెస్ నేతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడి భవన మరియు మహిళా భావన నిర్మాణానికి భూమి పూజ



బోధన్ గ్రామీణ వార్త నిర్భయం( మే 15): బోధన్ మండలంలోని కోపర్గా గ్రామంలో అంగన్వాడి భవన మరియు మహిళా భవన నిర్మాణానికి ఈరోజు భూమి పూజ చేసిన కాంగ్రెస్ నాయకులు మరియు అధికారులు ఈ కార్యక్రమంలో గంగా శంకర్ శరత్ ఏఈ డి ఈ గ్రామ సర్పంచ్ వార్డు సభ్యులు గ్రామ పెద్దలు అధికారులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## లోటస్ కాలనీ వాసుల ఆవేదన... మురికి కాల్వలో పెరిగిన చెట్లు, రాత్రిళ్లు పాములు--తేళ్ల భయం!




హనుమకొండ ప్రతినిధి మే 15 ( వార్త నిర్భయం )

హనుమకొండ జిల్లాలోని ప్రకాష్ రెడ్డి పేట లోటస్ కాలనీ రోడ్ నెంబర్--4 ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో ఉన్న మురికి కాల్వ పూర్తిగా చెట్లు, ముళ్ల పొదలతో నిండిపోవడంతో పరిస్థితి దారుణంగా మారింది. కాల్వ శుభ్రపరిచే పనులు నెలల తరబడి చేపట్టకపోవడంతో దోమలు, దుర్వాసనతో పాటు పాములు, తేళ్లు సంచరిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా రాత్రి సమయంలో ఇంటి బయటికి రావాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. చిన్నపిల్లలు, వృద్ధులు ఉన్న కుటుంబాలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నాయి. ఎప్పటికప్పుడు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని కాలనీవాసులు మండిపడుతున్నారు. “ప్రజల ప్రాణాల కంటే అధికారుల నిర్లక్ష్యమే పెద్దదా?” అంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు పడితే కాల్వ పొంగిపొర్లి కాలనీలోకి మురుగు నీరు చేరే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు వెంటనే స్పందించి మురికి కాల్వను శుభ్రపరచి, చెట్లు తొలగించి, ప్రజలకు భద్రత కల్పించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## మే 31న ఆర్యవైశ్య మహాసభ పట్టణ అధ్యక్ష ఎన్నికలు



సూర్యాపేట బ్యూరో మే 15 వార్త నిర్భయం

సూర్యాపేట: సూర్యాపేటలో ఆర్యవైశ్య మహాసభ పట్టణ కమిటీ అధ్యక్ష ఎన్నికలను ఈ నెల 31న స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించనున్నట్లు ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతాయని పేర్కొన్నారు. పోటీ చేసే అభ్యర్థులు రూ.5 వేల డిపాజిట్ చెల్లించి పూర్తి వివరాలతో నామినేషన్ దాఖలు చేయాలని సూచించారు. ఓటర్లు ప్రభుత్వ గుర్తింపు కార్డు తీసుకురావాలని, సెల్ ఫోన్లు అనుమతించబోమని తెలిపారు.ఈ సమావేశంలో ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు, మాజీ జిల్లా అధ్యక్షులు కర్నాటి కిషన్, జిల్లా క్రమశిక్షణ సంఘం చైర్మన్ బండారు రాజా, జిల్లా కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్, పట్టణ అధ్యక్షులు మంచాల రంగయ్య, నాయకులు తోట శ్యామ్ ప్రసాద్, రాచర్ల కమలాకర్, బొమ్మిడి లక్ష్మీనారాయణ, తప్పి గాంధి, గుండా శ్రీధర్, కొండా శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు గుండా రమేష్, పి.వి. లక్ష్మీనారాయణ, దేవరశెట్టి జనార్ధన్, వనమాల వెంకటేశ్వర్లు, జల్లిగప్పు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# బండి సాయి భగీరథ ను వెంటనే అరెస్టు చేయాలి.

**కేంద్రమంత్రి బండి సంజయ్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్.**

**లైంగిక దాడి ఆరోపణలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**

ఆత్మకూర్, మే 15 (వార్త నిర్భయం) లైంగిక దాడి ఆరోపణలు ఎదుర్కొంటూ పరారీలో ఉన్న బండి సాయి భగీరథను వెంటనే అరెస్టు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ డిమాండ్ చేసింది.పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆత్మకూర్ తహసీల్దార్ కార్యాలయం ఆవరణ, మెయిన్ రోడ్డుపై ధర్నా నిర్వహించారు. సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ సబ్ డివిజన్ కార్యదర్శి ప్రసాద్, ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు సాయి భగీరథ ఒక అమ్మాయిని మాయమాటలతో లొంగదీసుకుని అత్యాచారానికి పాల్పడ్డాడని ఆరోపించారు. తప్పు చేసిన నిందితుడిని రక్షించడమే కాకుండా, బాధితురాలిపైనే తిరిగి కేసు బనాయించడం సభ్య సమాజానికి సిగ్గుచేటని ఆయన విమర్శించారు. సాయి భగీరథపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, కేంద్రమంత్రి బండి సంజయ్‌ను వెంటనే కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు, నాయకులు జి. వెంకటయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు స్టీఫెన్, ఆత్మకూర్ పట్టణ సహాయ కార్యదర్శి బాలస్వామి, పార్టీ సబ్ డివిజన్ నాయకులు చెన్నయ్య, రాములు, భగవంతు, రాములు, శ్రీను తదితరులు పాల్గొన్నారు



# జడ్చర్ల మున్సిపాలిటీ కార్యాలయంలో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు.

**అవినీతి ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో సోదాలు.**

**ప్రతి ఫైలును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని ఏసీబీ డీఎస్పీ**

మహబూబ్‌నగర్ బ్యూరో, మే 15 (వార్త నిర్భయం) జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంపై వచ్చిన అవినీతి ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.మున్సిపల్ కార్యాలయంపై అనేక అవినీతి ఆరోపణలు, ఫిర్యాదులు రావడంతో ఈ కోణంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టామని ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. ఇంకా పూర్తిస్థాయిలో విచారణ పూర్తి కాలేదని, ప్రతి ఫైలును క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఫిర్యాదులు ఉన్న అధికారులను విచారిస్తున్నామని, విచారణ పూర్తి కావడానికి సమయం పడుతుందని తెలిపారు. ఏవైనా ఆరోపణలు నిరూపణ అయితే తదుపరి వివరాలు వెల్లడిస్తామని ఏసీబీ డీఎస్పీ స్పష్టం చేశారు.నిర్మాణాల అనుమతుల కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధితులు ఏసీబీ తనిఖీలపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొంతకాలంగా మున్సిపల్ కార్యాలయంపై అవినీతి ఆరోపణలు వెలువడుతున్నాయి. ఇదివరకే లాబీయింగ్ ఉపయోగించి ముడుపులు చెల్లించి నిర్మాణాల అనుమతులు పొందిన వారు లోలోన గుబులు చెందుతున్నారని స్థానికులు అంటున్నారు. జడ్చర్ల మున్సిపల్ కార్యాలయంపై ఏసీబీ తనిఖీలు జడ్చర్ల నియోజకవర్గ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి.




# అమ్మపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం..

**34 మందికి ఆపరేషన్‌కు సిఫార్సు.**

**డీఎంఅండ్‌హెచ్‌వో సాయినాథ్ రెడ్డి ఆదేశాలతో శిబిరం**

**107 మందికి పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ**

వనపర్తి, బ్యూరో మే 15 (వార్త నిర్భయం) వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ గౌని మాధవి వెంకటేశ్వర రెడ్డి ప్రారంభించారు.శిబిరంలో వనపర్తి జిల్లా ఆసుపత్రి కంటి వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించారు. మొత్తం 107 మంది పాల్గొనగా, 34 మందికి ఉచిత కంటి ఆపరేషన్ కోసం వనపర్తి ఏరియా ఆసుపత్రికి పంపనున్నట్లు అధికారులు తెలిపారు.కంటి సమస్యలు ఉన్నవారికి ఉచితంగా ఐ డ్రాప్స్, మందులు పంపిణీ చేశారు. అలాగే వివిధ రోగాలతో బాధపడుతున్నవారికి జనరల్ చెకప్ చేసి అవసరమైన మందులు అందజేశారు.ఈ శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ వైద్యులు డాక్టర్ సాయి ప్రసాద్, డాక్టర్ ప్రవళిక, హెల్త్ సూపర్వైజర్ రామస్వామి, పెద్దమందడి పీహెచ్‌సీ, మదిగట్ల సబ్ సెంటర్ ఏఎన్‌ఎంలు, సిబ్బంది, మూడు గ్రామాల ఆశ వర్కర్లు పాల్గొన్నారు.అమ్మపల్లి గ్రామ ఉపసర్పంచ్ బాబు నాయక్, మాజీ సర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు చంద్రశేఖర్, ఉద్య నాయక్, వరలక్ష్మి, శ్వేత, గ్రామ నాయకులు, యువకులు, మహిళలు, గ్రామస్తులు హాజరయ్యారు.శిబిరం విజయవంతానికి కృషి చేసిన డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సాయినాథ్ రెడ్డికి సర్పంచ్, గ్రామస్తులు అభినందనలు తెలిపారు



## దొడగుంటపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా జంగం గోపాల్ ఏకగ్రీవ ఎన్నిక

**ఉపాధ్యక్షుడిగా బూసని శ్రీకాంత్, కార్యదర్శిగా కె. కృష్ణయ్య, కోశాధికారిగా నందమోని వెంకటయ్య**

**జిల్లా సహకార సంఘం ఎన్నికల అధికారి కవిత ఆధ్వర్యంలో ఎన్నికలు**

వనపర్తి బ్యూరో, మే 15 (వార్త నిర్భయం).

పెద్దమందడి మండలం దొడగుంటపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడిగా జంగం గోపాల్ సన్నాఫ్ చెన్నప్ప ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.శుక్రవారం దొడగుంటపల్లి గ్రామంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘ భవనంలో జిల్లా సహకార సంఘం ఎన్నికల అధికారి కవిత ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు.నూతన కార్యవర్గం అధ్యక్షుడు.జంగం గోపాల్ సన్నాఫ్ చెన్నప్ప -ఉపాధ్యక్షుడు.బూసని శ్రీకాంత్ సన్నాఫ్ ఆంజనేయులు కార్యదర్శి కె కృష్ణయ్య సన్నాఫ్ బాలయ్యకోశాధికారినందమోని వెంకటయ్య సన్నాఫ్ కరెన్నలు ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడికి ఎన్నికల అధికారి నియామక పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం సభ్యులు నాగన్న, నందమోని తిరుపతయ్య, జంగం పెద్ద నాగరాజు, జంగం చిన్న గోపాల్, ఆంజనేయులు, బి. ఆంజనేయులు, దండు చిన్న రాములు, దండు చెన్నారాయుడు, దండు పెద్ద కురుమన్న, టైలర్ కురుమయ్య, రాజశేఖర్, తోకల సైదులు, బి. శ్రీనివాసులు, బి. సైదులు, డి. కృష్ణ, జంగం నాగరాజు, జేబి రాములు, సంఘం సభ్యులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలులో జాప్యం,

**అధిక తరుగుపై బీజేపీ ఆగ్రహం**

**చిట్యాల మార్కెట్ యార్డులో బీజేపీ కిసాన్ మోర్చా తనిఖీ.**

**అర్హత లేని గుత్తేదారుల టెండర్ల రద్దు, కొనుగోలు వేగిరపరచాలని డిమాండ్**

వనపర్తి బ్యూరో, మే 15 (వార్త నిర్భయం) ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలనిబీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆర్. అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో చిట్యాల శివారులోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కొనుగోలు కేంద్రాన్ని పార్టీ నేతలు సందర్శించారు. కొనుగోలు ఆలస్యం కావడంతో రెండు నెలలుగా రైతుల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయిందని ఆరోపించారు. క్వింటాలకు 6-8 కిలోల తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారని విమర్శించారు. అర్హత, సామర్థ్యం లేని గుత్తేదారులకు టెండర్లు ఇవ్వడంతో ధాన్యం రవాణాకు సరిపడా లారీలు లేవని అన్నారు. అనర్హుల టెండర్లను రద్దు చేసి అర్హులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో ధాన్యం కొనుగోలును తక్షణమే వేగిరపరచాలని, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న తరుగు కోతను అరికట్టాలని కోరారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ రాష్ట్ర నేత అయ్యగారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నా పూర్తిస్థాయిలో ధాన్యం తూకం కావడం లేదని అన్నారు. వనపర్తి మార్కెట్ యార్డులో ఐదు కొనుగోలు కేంద్రాలు ఉన్నా కేవలం 40-45 మంది మాత్రమే తూకాలు వేస్తున్నారని, హమాలీల కొరతతో మార్కెట్ యార్డు ధాన్యం రాశులతో నిండిపోయిందని చెప్పారు. మిల్లుల వద్ద లారీల్లో 6 కిలోల తరుగు తీస్తూ రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపించారు.అర్హత లేని అధికార పార్టీ నేతలకు టెండర్లు ఇవ్వడంతో లారీలు సరఫరా కావడం లేదని, జిల్లా కలెక్టర్ వెంటనే అనర్హుల టెండర్లను రద్దు చేసి అర్హులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నేతలు సబి రెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్. వెంకటేశ్వర్ రెడ్డి, కేతూరి బుడ్డన్న, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెద్దిరాజు, శ్రీనివాస్ గౌడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఆర్. అరవింద్ రెడ్డి, పట్టణ నేత ఉపేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు



